
మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

భూ భారతి దరఖాస్తులను పరిష్కరించాలి

» కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): భూభారతి దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆర్డీవోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో 1,200 కంటే ఎక్కువగా ఓటర్లు ఉంటే అదనపు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, వాటికి బీఎల్‌వోలను నియమించాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించి అన్ని శిక్షణా కార్యక్రమాలను ఈ నెల 3 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించాలని, అందుకు మాస్టర్ ట్రైనర్లను నియమించుకోవాలని ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో నజరీనక్షకు సంబంధించి ఆయా పోలింగ్ స్టేషన్ల సరిహద్దుల్లోకి వచ్చే అన్ని కుటుంబాలు, ఓటర్ల సంఖ్యపై సమగ్ర సర్వే చేపట్టాలన్నారు. భూ భారతి చట్టం అమలులో భాగంగా ఇప్పటివరకు వచ్చిన 22,096 దరఖాస్తుల్లో 21,718 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. వచ్చిన దరఖాస్తులన్నింటినీ ఈ నెల 10వ తేదీలోగా పరిష్కరించాలని ఆర్డీవోలు, తహసీల్దార్లను ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీఆర్వో సంగీత, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు. అలాగే వన మహోత్సవంపై నిర్వహించిన సమీక్షలో ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్ మేరకు మొక్కలు నాటాలని అధికారులకు సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్, పంచాయతీ అడ్వాన్స్ ఇండెక్స్ సిటిజెన్ సర్వీసెస్, శానిటేషన్, ఉపాధి హామీపై చర్చించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, డీపీవో సురేష్ మోహన్, డీఈవో సుశీందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

షూటింగ్ పోటీల్లో మునీర్‌కు బ్రాంజ్ మెడల్



ఇబ్రహీంపట్నం, జూలై 1(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో 11వ తెలంగాణ రాష్ట్ర షూటింగ్ కాంపిటీషన్ ఇన్ ఎయిర్ స్మాల్ బోర్ షాట్‌గన్ ఈవెంట్స్ - 2025లో 50 మీటర్ల ఓపెన్ సైడ్ నిర్వహించారు. ఇందులో ఇబ్రహీంపట్నం మండలం కప్పాడు గ్రామానికి చెందిన మహ్మద్ మునీర్ రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంక్ సాధించి బ్రాంజ్ మెడల్ అందుకున్నారు. జూన్ 21 నుంచి 30 వరకు ఈ పోటీలు జరుగగా సోమవారం సాయంత్రం ముగింపు కార్యక్రమంలో అతిథుల నుంచి ఈ మెడల్ అందుకున్నట్లు మునీర్ తెలిపారు.

బహదుర్‌గూడలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

శంషాబాద్ రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బహదుర్‌గూడ ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు మంగళవారం కూల్చివేశారు. తహసీల్దార్ రవీందర్‌దత్ ఆధ్వర్యంలో ప్రభుత్వ భూముల్లో నిర్మించిన, ఇళ్లను, ప్రహరీని అధికారులు జేసీబీలతో కూల్చివేయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను ఎవరూ కొనుగోలు చేసినా, అమ్మినా చెల్లవన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శంషాబాద్ మండలంలో ఎక్కడ ప్రభుత్వ భూమిని కబ్జా చేసినా, అక్రమ నిర్మాణాలు చేపట్టినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తుండగా నిర్మాణదారులకు, రెవెన్యూ అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణ, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ధరణితో ఆ ఊరు పేరు ఆన్‌లైన్‌లో మాయమైంది. జంట గ్రామాలుగా ఉన్న ఆ ఊరు ఒకే పేరుతో వాడుకలోకి వచ్చినా రెండు రెవెన్యూ గ్రామాలుగా కొనసాగుతున్నాయి. దీంతో రెండు గ్రామలకు చెందిన పలువురు రైతుల భూములు ఒకే సర్వే నంబర్లపై ఉండడంతో లావాదేవీలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన భూ భారతిలోనూ ఈ సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఇటీవల రెవెన్యూ గ్రామ సభలోనూ రైతులు అధికారులకు విన్నవించారు. ఉన్నతాధికారులు స్పందిస్తే తప్పా.. తమ సమస్యకు పరిష్కారం లభించదని వాపోతున్నారు.


శేరిగూడబద్రాయపల్లి ముఖ చిత్రం

ధరణితో ఊరు మాయం

'భూ భారతి' వచ్చినా రైతులకు జరగని న్యాయం

- జంట గ్రామాలు ఒక్కటైనా రెండు రెవెన్యూలుగా కొనసాగింపు
- ఒకే సర్వే నంబర్‌తో పలువురి రైతుల భూములు
- మీ సేవలో విలేజ్ డాటా నాట్ అవైలబుల్
- భూ సర్వే, క్రయ విక్రయాలకు తప్పని తిప్పలు

కొత్తూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండల పరిధిలోని శేరిగూడబద్రాయపల్లి గ్రామం గతంలో శేరిగూడ, బద్రాయపల్లి జంట గ్రామాలుగా ఉండేవి. రానురాను ఈ రెండు గ్రామాలు కలిసి శేరిగూడబద్రాయపల్లిగా నామకరణంలోకి వచ్చాయి. జంట గ్రామాలుగా ఉన్న సమయంలో రెండు రెవెన్యూ గ్రామాలుగా రికార్డులున్నాయి. రెవెన్యూ రికార్డుల ప్రకారం.. శేరిగూడ గ్రామంలోని భూములకు 1 నుంచి 53 సర్వే నంబర్లు ఉండగా, బద్రాయపల్లిలో 1 నుంచి 88 వరకు ఉన్నాయి. శేరిగూడలో ఉన్న ప్రభుత్వ భూములు, బద్రాయపల్లికి చెందిన పలు పట్టా భూములకు ఒకే సర్వే నంబర్లు లింకై ఉండడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. శేరిగూడలో దాదాపు 20 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, బద్రాయపల్లిలో 30 ఎకరాలకు

మిగతా 6వ పేజీలో...


శేరిగూడబద్రాయపల్లి పంచాయతీ కార్యాలయం

ఆన్‌లైన్‌లో మా ఊరు పేరు లేదు



బద్రాయపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 15లో నాకు కొంత భూమి ఉంది. భూ సర్వే కోసమని మీ సేవకు వెళ్లి దరఖాస్తు చేసుకుంటే మా గ్రామం పేరు కనబడటం లేదు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి కూడా తీసుకుపోయాను. ఉన్నతాధికారులు సమస్యను గుర్తించి పరిష్కరించాలి.

- నున్నాల శ్రీనివాస్, రైతు, శేరిగూడబద్రాయపల్లి



లింక్ తొలగించాలి

శేరిగూడ, బద్రాయపల్లి రెవెన్యూ గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ, పట్టా భూములకు ఉన్న లింక్‌ను తొలగించాలి. ధరణి వచ్చిన తర్వాత గ్రామంలో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. భూముల క్రయ, విక్రయాలకు ఆటంకం ఎదురవుతోంది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలి.

- అంబటి ప్రభాకర్, మాజీ సర్పంచ్, శేరిగూడబద్రాయపల్లి


ఈత, కర్జూర మొక్కలు అందజేస్తున్న సీఐ బద్యనాథ్ చౌహాన్

ఈత, ఖర్జూర మొక్కలు నాటాలి

» ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్

తలకొండపల్లి, జూలై 1(ఆంధ్రజ్యోతి): వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 2025-26 సంవత్సరానికి 8,800 ఈత, ఖర్జూర మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ తెలిపారు. ఆమనగల్లు, తలకొండపల్లి, మాడ్గుల, కడ్తాల మండలాల పరిధిలో ఇప్పటికే 5,200 ఈత, ఖర్జూర మొక్కలు నాటినట్లు పేర్కొన్నారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామంలో మంగళవారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈత, ఖర్జూర మొక్కల పెంపకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జగత్ రెడ్డి పొలంలో 200 ఈత, ఖర్జూర మొక్కలను నాటారు. అనంతరం మాట్లాడుతూ రైతులకు ఉచితంగా ఈత, ఖర్జూర మొక్కలు అందజేస్తున్నట్లు తెలిపారు. చెరువు గట్లు, పొలాల వెంట మొక్కలు నాటుకోవడానికి రైతులు ముందుకు రావాలని కోరారు. ఈత మొక్కల పెంపకంతో గీతా కార్మికులకు ఉపాధి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది, గీత కార్మికులు, రైతులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన

» యాచారం, చౌదరిగూడ మండలాల్లో భారీ వర్షం
» పంటలకు జీవం, జలమయమైన రోడ్లు


చౌదరిగూడ: లాల్‌పహాడ్‌లో కురుస్తున్న వర్షం


యాచారంలో కురుస్తున్న వర్షం

రంగారెడ్డి అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మంగళవారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. సాయంత్రం ప్రారంభమైన వర్షం రాత్రి వరకూ కొనసాగింది. కురిసిన వర్షానికి వాగులు, వంకల్లో వరద నీరు ఉధృతంగా ప్రవహించింది, వికారాబాద్ జిల్లా కేంద్రంలో రైతుబజార్‌లోని వరద నీరు భారీగా చేరడంతో రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉమ్మడి జిల్లా పరిధిలో అత్యధికంగా ఇబ్రహీంపట్నంలోని మంగల్‌పల్లిలో 45.8 మి.మీ. వర్షం కురిసింది. కొంగరకలాన్ కలెక్టరేట్ వద్ద 42.8, వర్షపాతం నమోదు కాగా, శంషాబాద్‌లోని పెద్దషాపూర్‌లో

మిగతా 5వ పేజీలో...

శభాష్.. శంకర్

» సొంత నిధులతో కాలేజీ నిర్మాణం
» ఎమ్మెల్యే వీర్లపల్లికి మంత్రి జూపల్లి అభినందనలు


ఎమ్మెల్యే శంకర్‌ను అభినందిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

షాద్‌నగర్ అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను మంగళవారం ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. ప్రభుత్వ సహకారం లేకుండా దాదాపు రూ.15 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను పరిశీంచిన మంత్రి పక్కనే ఉన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను భుజం తట్టి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద పిల్లల బాగు కోసం 20 శాతం దాతల సహకారం, 80శాతం ఎమ్మెల్యే శంకర్ సొంత నిధులు వెచ్చించి భవనం నిర్మించడం గొప్ప విషయమన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ఆదర్శంగా తీసుకుని ప్రతిఒక్కరూ విద్యాభివృద్ధికి సహకారం అందించాలని కోరారు.

ఫోన్ ట్యాపింగ్ సిగ్గుచేటు

ఎన్నికలకు ముందు పాల్పడిన ఫోన్ ట్యాపింగ్‌కు సిగ్గుపడాల్సింది పోయి, మీడియా సంస్థలపై దాడులు చేయడమేమిటని మంత్రి జూపల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో మూడు మీడియా సంస్థలపై దాడులు చేస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి హెచ్చరిస్తున్నారని విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి స్పందించారు. చేసిన వెదవ పనికి సిగ్గుపడాలని, మరీ దాడులు చేస్తామనడమేమిటని విస్మయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, ఏ.కృష్ణారెడ్డి, రఘునాయక్, అగ్గనూరి బస్వం, ఎండీ ఇబ్రహీం, అందే మోహన్, ముబారక్, అశోక్ పాల్గొన్నారు.

ఆమనగల్లు అభివృద్ధికి రూ.25 కోట్లు


ఆమనగల్లులో ఓపెన్ జిమ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

» ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
» రెండు ఓపెన్ జిమ్‌ల ప్రారంభం

ఆమనగల్లు, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపాలిటీలో రూ.25 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రణాళిక రూపొందించినట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఇప్పటికే రూ.10 కోట్ల అభివృద్ధి పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయిందని పేర్కొన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని కేవీఆర్, ధరణి వెంచర్లలో మున్సిపాలిటీ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ. 26 లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లను మంగళవారం ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, టీపీసీసీ అధికార ప్రతినిధి బాలాజీ సింగ్, మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆమనగల్లు, కల్వకుర్తి మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులకు రూ.30 కోట్లు కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డిని అభ్యర్థించగా సానుకూలంగా స్పందించారన్నారు.ఆమనగల్లు సురసముద్రం సుందరీకరణకు రూ.2.50 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఆమనగల్లులో రూ.17.50 కోట్లతో అధునాతన సౌకర్యాలతో ప్రభుత్వ ఆసుపత్రి భవనం నిర్మిస్తున్నట్లు చెప్పారు. అసంపూర్తిగా నిలిచిపోయిన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ అనితావిజయ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, మార్కెట్ డైరెక్టర్లు వస్పుల శ్రీశైలం, తాళ్ల రవీందర్, పాండురంగయ్య, నాయకులు నాయకులు రాములు, శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య, కృష్ణనాయక్, ఖలీల్, శ్రీకాంత్, పర్వతాలు, శ్రీను నాయక్, ఖాదర్‌ఖాద్రీ, జలాల్, సాయి, బాబా, విజయ్ రాథోడ్, బద్ది వెంకటేశ్, సుమన్, అలీమ్, రామలింగం, నాజర్, ఖాదర్, రహీమ్, సురేశ్‌నాయక్, పరమేశ్, ఎస్ఐ వెంకటేశ్, ఏఈ శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది సత్యనారాయణ, దామోదర్, ఉపేందర్ రెడ్డి, ఎల్లయ్య పాల్గొన్నారు.


జిమ్ చేస్తున్న ఎమ్మెల్యే

రేపటి నుంచి బీఎల్‌వోలకు శిక్షణ

కందుకూరు, జులై1(ఆంధ్రజ్యోతి): బీఎల్‌వోలకు ఈ నెల 3 నుంచి 17 వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, బీఎల్‌వోలు తప్పక హాజరుకావాలని మహేశ్వరం నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో గుర్తించిన మాస్టర్ ట్రైనింగ్ అధికారులతో నిర్వహించిన శిక్షణ తరగతులకు హాజరై మాట్లాడారు. ఓటర్ లిస్టులను పటిష్ఠంగా చేపట్టడానికి బీఎల్‌వోలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తలహసీల్దార్లు తాజుద్దీన్, శేఖర్, మణిపాల్‌రెడ్డి, మాస్టర్ ట్రైనింగ్ అధికారులు పాల్గొన్నారు.



సాగు పెరిగితే ఆయిల్‌పామ్ మార్కెట్

జిల్లా వ్యవసాయాధికారి నరసింహారావు

4

శిథిలావస్థలో సర్కారు భవనాలు

» పాతవి కూల్చి కొత్తగా నిర్మించాలని డిమాండ్
» మరమ్మతులు లేక నిరుపయోగం
» కూలడానికి సిద్ధంగా పాఠశాలల తరగతి గదులు
» పట్టించుకోని అధికారులు, పాలకులు


మేడిపల్లిలో పాఠశాల దుస్థితి

యాచారం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ప్రజల అవసరాల కోసం నిర్మించిన భవనాలు నేడు శిథిలావస్థకు చేరాయి. నేడు అవి సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. అధికారుల, ప్రజాప్రతినిధుల నిర్లక్షంతో అడ్డగోలుగా నిర్మించడంతో ప్రస్తుతం శిథిలమవుతున్నాయి. యాచారం మండలంలోని మేడిపల్లిలో సుమారు రూ.రెండున్నర కోట్లతో నిర్మించిన పలు భవనాలు శిథిలావస్థకు చేరాయి. 2009లో ఆనాటి హోం శాఖ మంత్రి పి.సబితాఇంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించిన బీసీ హాస్టల్ భవనం వృథాగా మారింది. దీనిని ప్రభుత్వాసుపత్రిగా మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. దానిని గ్రామానికి చెందిన లిక్కి వెంకటరెడ్డి సొంత డబ్బుతో చదును చేయించారు. 2001లో ఆనాటి రాష్ట్ర మంత్రి కొండ్రు పుష్పలీల ప్రారంభించిన అంగన్‌వాడీ భవనం కంప చెట్లతో నిండిపోయింది. గ్రామంలో మరోచోట రూ.50 లక్షలతో 1986లో నిర్మించిన పాఠశాల భవనాలు శిథిలమవుతున్నాయి. 2011లో సుమారు రూ.32లక్షల నిధులతో నిర్మించిన పాఠశాల తలుపులు, కిటికీలు పాడైపోయి నిరుపయోగంగా మారాయి. గ్రామంలో పలు చోట్ల కమ్యూనిటీ భవనాలు వృథాగా దర్శనమిస్తున్నాయి.

నిరుపయోగంతో శిథిలం

చౌదర్‌పల్లి గ్రామంలో సొసైటీ భవనం శిథిలావస్థకు చేరింది. నందివనపర్తి ఉన్నత పాఠశాల నాలుగు తరగతి గదులు, దర్మన్నగూడలో మూడు తరగతి గదులు, చింతపట్లలో నాలుగు తరగతి గదులు శిథిలావస్థకు చేరాయి. చిన్న తూండ్లలో రెండు భవనాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. మండల కేంద్రంలో గృహ నిర్మాణ శాఖ కార్యాలయం కోసం

మిగతా 6వ పేజీలో...

పాతవాటి స్థానాల్లో కొత్త భవనాలు నిర్మించాలి



ప్రభుత్వ భవనాలు పాతవి కూల్చి కొత్తగా నిర్మించాలి. పాఠశాల తరగతి గదులు నిర్మించాలి. మండల సమావేశ మందిర నిర్మాణం పూర్తి చేయడానికి రూ.25 లక్షలు కేటాయించి పూర్తి చేయించడంలో అధికారులు నిర్లక్షంగా వ్యవహరిస్తున్నారు. మండల కేంద్రంలో కొత్తగా ఎస్సీ దుకాణా సముదాయం కట్టించాలి.

- కొప్పు సుకన్య, మాజీ ఎంపీపీ

నిరుపయోగంగా బస్టాండ్

● యాలల ప్రాంగణంలోకి రాని బస్సులు
● రోడ్డుపైనే ప్రయాణికులు, విద్యార్థుల నిరీక్షణ



వినియోగంలో లేక పొదలతో నిండిన యాలాల బస్టాండ్

యాలాల, జూలై1(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్టాండ్ నిరుపయోగంగా మారింది. ఇందుకు ప్రధాన కారణం బస్సులు బస్టాండ్‌లోకి రాకవడమే! ప్రయాణికులు, విద్యార్థులు బస్సుల కోసం రోడ్డుపైనే వేచి ఉంటున్నారు. డ్రైవర్లు, కండక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారం వ్యవహరిస్తూ బస్సులను నడుపుతున్నారని ప్రజలు అంటున్నారు. యాలాలలో 1989లో గోరెపల్లికి చెందిన రవీందర్‌గౌడ్ బస్టాండ్‌కోసం రెండెకరాల పొలాన్ని విరాళంగా ఇచ్చారు. ఆ స్థలంలో బస్టాండ్ నిర్మించారు. కొత్తలో బస్సులు లోపలికి వెళ్లేవి. అయితే రెండేళ్లుగా బస్సులు బస్టాండ్‌లోకి అసలే రావడం లేదు. ప్రయాణికులు రోడ్డుపై బస్సు ఎక్కడం, దిగడం చేస్తున్నారు. ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. యాలాలకు పనుల నిమిత్తం తాండూరు నుంచి, గ్రామాల నుంచి ప్రజలు వచ్చి పోతుంటారు. ఉన్నత పాఠశాల విద్యార్థులు గ్రామాల నుంచి వస్తుంటారు. వీరంతా బస్సుల కోసం వేచి చూస్తుంటారు. ఎండ, వానల్లో రోడ్డు పక్కనే నిల్చుంటున్నారు. డిపో అధికారులు స్పందించి బస్సులు బస్టాండ్‌లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రజలు దేశీయ వస్తువులనే వినియోగించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న స్వదేశీ జాగరణ మంచ్ రాష్ట్ర కో-కన్వీనర్ ఈశ్వర్

చేవెళ్ల, జులై 1 (ఆంధ్రజ్యోతి): దేశీయంగా తయారైన వస్తువులనే ఉపయోగించాలని స్వదేశీ జాగరణ మంచ్ రాష్ట్ర కో-కన్వీనర్ ఈశ్వర్ తెలిపారు. చేవెళ్లలోని చైతన్య కళాశాలలో మంగళవారం స్వదేశీ జాగరణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ.. దేశం మరో స్వదేశీ ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్వదేశీ వస్తువులను వాడితే వాటి ద్వారా దేశ ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. స్థానికంగా తయారయ్యే వస్తువులకు డిమాండ్ పెరిగితే అభివృద్ధి దిశగా పయనిస్తామని వివరించారు. ఉదయం లేచింది మొదలు రాత్రి వరకు విదేశీ వస్తువులను వాడుతుండడం వల్లే ఆర్థికవ్యవస్థ కుదేలవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాలమూరు విభాగ్ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్ తదితరులు ఉన్నారు.

5 నుంచి కంటి వైద్యశిబిరం

● టాస్క్ సీవోవో రాఘవేందర్‌రెడ్డి



ఆమనగల్లు, జూలై 1(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గంలో అంధత్వ నివారణ కార్యక్రమాన్ని ఉద్యమ స్ఫూర్తితో ముందుకు తీసుకుపోతున్నామని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. ఆమనగల్లులోని ఫౌండేషన్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. ఈ నెల 5నుంచి 13 వరకు కల్వకుర్తి సీకేఆర్ ఫంక్షన్ హాల్‌లో కంటి వైద్యశిబిరం నిర్వహిస్తామని తెలిపారు. చెన్నై శంకరన్ నేత్రాలయ సహకారంతో శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలోపం ఉన్న వారికి ఐవోఎల్ ఆపరేషన్లు, లెన్స్, ఉచితంగా అద్దాలు అందజేస్తామని వివరించారు.

రూ.కోటితో ఎల్లమ్మ ఆలయాభివృద్ధికి కృషి



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మాజీ మంత్రి అరవింద లింబావళి

తాండూరు రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ-కర్ణాటక సరిహద్దుల్లోని కొత్లాపూర్ రేణుక ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి దేవాదాయ శాఖ ద్వారా రూ.1కోటి నిధులు మంజూరు చేయిస్తానని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. కేరళ వేదపండితులతో మూడు రోజులు కొనసాగిన మృత్యుంజయ హోమం మంగళవారంతో ముగిసింది. హోమంలో కర్ణాటక విద్యాశాఖ మాజీ మంత్రి అరవింద లింబావళితో ఎమ్మెల్యే పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. ఈ ఎల్లమ్మ ఆలయం పురాతన కాలం నాటిదని, మహిమ గల తల్లి అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖలతో మాట్లాడి రూ.కోటి నిధులు మంజూరు చేయించి కల్యాణ మండపం, భక్తులకు వసతి గదులు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు కల్పిస్తామన్నారు. నెలరోజులు జరిగే జాతరలో తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రల భక్తులు అమ్మ వారిని దర్శించుకున్నారన్నారు.

వేద పండితులతో ఆలయ శుద్ధి

కొత్లాపూర్ రేణుక ఎల్లమ్మ తమ ఇంటి దేవత అని కర్ణాటక మాజీ మంత్రి అరవింద లింబావళి చెప్పారు. 15సంవత్సరాల క్రితం ఆలయాన్ని పునర్నిర్మించామని, అయితే నిర్వహణ లోపం కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీంతో కేరళ వేద పండితుల ద్వారా ఆలయాన్ని శుద్ధి చేయించామన్నారు. దేశంలోని వివిధ 30 ఆలయాల్లో నిర్వహించిన కుంకుమార్చనలతో తెచ్చిన ద్రవ్యాలతో ఇక్కడ మూడు రోజులపాటు మృత్యుంజయ హోమాన్ని క్రైముక్ నారాయణ నంబూద్రి ఆధ్వర్యంలో నిర్వహించారని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో కర్ణాటకలోని మహాదేవపురం ఎమ్మెల్యేగా నాలుగు సార్లు గెలిచానని, ఆ రాష్ట్ర మంత్రిగానూ పనిచేశానని ఆయన వివరించారు. రూ.కోటితో ఆలయంలో పెయింటింగ్, గ్రానైట్స్ వంటి పనులు చేయించామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నవీన్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, నాయకులు సాయిలు, వడ్డె శ్రీనివాస్, పండరి, రాందాస్, గోపాల్, రాంచంద్రారెడ్డి, ప్రదీప్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బైండ్ల రాజు, లల్యానాయక్, లాలయ్యగౌడ్ శ్రీధర్‌గౌడ్, ఉదయభాస్కర్‌రెడ్డి, ఆలయ ప్రతినిధులు రవి, శ్రీనివాస్ పూజారి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల వివరాల సేకరణ



వివరాలు సేకరిస్తున్న రజనీకాంత్

కడ్తాల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): విద్య శాఖ, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో యంగ్ ఎర్త్ లీడర్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీజీఆర్ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ రజనీకాంత్ తెలిపారు. వైఈఎల్‌పీలో భాగంగా పాఠశాలల్లో సర్వే నిర్వహించి వివరాలను సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. కడ్తాల జెడ్పీ బాలుర పాఠశాలలో మంగళవారం హెచ్ఎం జంగయ్య, విద్యార్థులు, టీచర్లతో పాఠశాల వివరాల నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. పాఠశాలలో వాటర్ హార్వెస్టింగ్ పిట్, కంపోస్ట్ పిట్, నో ప్లాస్టిక్ జోన్, కిచెన్ గార్డెన్, సీడ్ మ్యూజియం, ప్రిపరేషన్ ఆఫ్ విలేజ్ జియోగ్రఫీ మ్యాప్స్, ప్లాంటేషన్ వంటి వాటిపై కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు రాష్ట్రంలో సీజీఆర్ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో టీచర్లు భాగ్యలక్ష్మి భీముడు, శోభారాణి, కౌసల్య, విద్యార్థులు సుష్మంత్, ముజీద్, ఆదిత్య, ప్రసాద్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఓరియంటేషన్ కార్యక్రమం



విద్యార్థులతో మాట్లాడుతున్న నిర్వాహకురాలు

శంషాబాద్ రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ హైదరాబాద్ 2025-27 బ్యాచ్ కోసం నిర్వహించిన అభ్యుదయ్-2025 మేనేజ్‌మెంట్ ఓరియంటేషన్ మంగళవారం ముగిసింది. జూన్ 18న దీనిని ప్రారంభించారు. విద్యార్థులకువారి విద్యా, వృత్తిపరమైన వృద్ధికి ఆచరణాత్మక, సాంకేతిక అంశాలను వివరించారు. కార్యక్రమంలో టీసీఎస్ హైదరాబాద్ హెడ్ చల్లా నాగ్, ఎలికో హెల్త్‌కేర్ సర్వీసెస్ లిమిటెడ్ వైస్‌చైర్‌పర్సన్, ఎండీ డాక్టర్ వనిత, స్మార్ట్ ఫార్మా 360 సీఈవో, సాకేత, న్యాయవాది మొబాష్షిర్ సర్వర్, కెనడాలోని డల్హౌసీ వర్సిటీ ప్రొఫెసర్ స్టీఫెన్ మెచౌలన్, కాలిబర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ రాజేశ్ మీనన్, గౌహతిలోని టెక్నాలజీ ఇన్నోవేషన్ అండ్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ సీనియర్ ఫెలో పార్థా ప్రతిమ్‌దాస్ గుప్తా, డాక్టర్ గౌతమ్ సిన్హా తదితరులు పాల్గొన్నారు.

అనురాగ్ అధ్యాపకురాలికి డాక్టరేట్



కూటికంటి సంధ్య

ఘట్‌కేసర్ రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): అనురాగ్ యూనివర్సిటీ అధ్యాపకురాలు కూటికంటి సంధ్యకు డాక్టరేట్ లభించింది. పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ నిబంధనల మేరకు 'జీవ సంబంధ నానో పదార్థాలు, సంశ్లేషణ-సూక్ష్మ జీవ నిరోధక అండ్ ఎలెక్ట్రోకెమికల్ అధ్యయనాల్లో' ఆమె డాక్టర్ సవితా బెల్వాల్ పర్యవేక్షణలో రీసెర్చ్ పత్రాలు సమర్పించారు. గత నెల 28న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఆగర్తల కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ హెడ్ ఆధ్వర్యంలో వైవా పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. దీంతో అనురాగ్ యూనివర్సిటీ సంధ్యకు డాక్టరేట్ ప్రదానం చేసి సత్కరించింది. ఈ మేరకు యూనివర్సిటీ సీఈవో సూర్యదేవర నీలిమ, హెచ్‌వోడీలు, అధ్యాపకులు ఆమెను అభినందించారు.

కెమికల్ ఫ్యాక్టరీలో ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలి

వికారాబాద్, జూలై 1(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో పదుల సంఖ్యలో కార్మికులు మరణించడం, అనేక మంది గాయపడిన సంఘటనపై సమగ్ర న్యాయచారణ జరిపించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వై.గీత డిమాండ్ చేశారు. మంగళవారం వికారాబాద్‌లో ఆమె మాట్లాడారు. ఈ సంఘటనకు యాజమాన్యమే బాధ్యత వహించాలని, రక్షణ చర్యలు చేపట్టక పోవడం, కార్మిక శాఖ పర్యవేక్షణ లేకపోవడం వల్లే ప్రమాదం జరిగిందన్నారు. మరణించిన వారి, క్షతగాత్రుల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించి, ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ఎల్‌హెచ్‌పీఎస్ అవిర్భావ దినోత్సవం



ఎల్‌హెచ్‌పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న రాజు

కేశంపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): లంబాడా హక్కుల పోరట సమితి (ఎల్‌హెచ్‌పీ ఎస్) 29వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం మండలాధ్యక్షుడు రాజునాయక్ నేతృత్వంలో నిర్వహించారు. ఎల్‌హెచ్‌పీఎస్ జెండాను ఆవిష్కరించారు. 'మా తండాలో మా రాజ్యం' నినాదంతో 28ఏళ్లుగా లంబాడాల సమస్యలపై పోరాటం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, నంది గామ మండలాధ్యక్షుడు రాము, చందర్, మోహన్, అయోధ్య శ్రీనివాస్, పరశురాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సాగు పెరిగితే ఆయిల్‌పామ్ మార్కెట్

● జిల్లా వ్యవసాయాధికారి నరసింహారావు



వేములనర్వలో అయిల్ పామ్ తోటను పరిశీలిస్తున్న డీఏవో నరసింహారావు, డీఎస్‌హెచ్‌వో సురేష్ తదితరులు

కేశంపేట, జూలై1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అత్యధికంగా కేశంపేట మండలంలో ఆయిల్ పామ్ సాగవుతుందని, సాగు విస్తీర్ణం పెరిగితే మండలంలోనే ఆయిల్ పామ్ మార్కెట్ పెట్టే చాన్స్ ఉందని జిల్లా వ్యవసాయాధికారి(డీఏవో) నరసింహా రావు అన్నారు. మంగళవారం డీఏవో, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేష్‌తో కలిసి ఆయిల్ పామ్‌లో అంతర పంటల సాగుపై కేశంపేట మండలంలో రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. వేములనర్వలో క్షేత్రస్థాయిలో ఆయిల్ పామ్ తోటలను పరిశీలించారు. ఎకరానికి రూ.4,200 ఖాతాలో జమ అవుతున్నాయా.. లేదా? అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆయిల్‌పామ్ తోటలో అంతరపంటలుగా వేరు శనగ, మొక్కజొన్న సాగు చేస్తున్నట్లు రైతులు తెలిపారు. యాసంగిలో సబ్సిడీపై మొక్కజొన్న, వేరశనగ విత్తనాలు అందించేందుకు ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు. అనంతరం మండల పరిధి అల్వాల రైతు వేదికలో రైతులకు ఉచితంగా కంది విత్తనాలను పంపిణీ చేశారు. కేశంపేట మండలానికి 14 క్వింటాళ్ల కంది విత్తనాలు వచ్చాయని తెలిపారు. అంతకుముందు రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తంలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో వ్యవసాయశాఖ కమిషనరేట్ ఏడీ ఇంతియాజ్, ఏవో శిరీష, షాద్‌నగర్ ఉద్యానవన శాఖ అధికారి హిమబిందు, ఏఈవోలు వినయ్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



బహుమతులను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకుడు వెంకట్‌రెడ్డి

షాబాద్, జూలై 1(ఆంధ్రజ్యోతి):క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎలుగంటి వెంకట్‌రెడ్డి అన్నారు. ఏఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా షాబాద్‌లోని పీఆర్ఆర్ మినీ స్టేడియంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన వారికి మంగళవారం బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఏఎంఆర్ ట్రస్ట్ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, సర్దార్‌నగర్ ఏఎంసీ డైరెక్టర్ సంజీవరెడ్డి, నాయకులు దండు రాహుల్‌గుప్తా, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు
ఘనంగా నిర్వహించాలి


జెండా గద్దె నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కడ్తాల్, జూలై 1(ఆంధ్రజ్యోతి):ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని, ఈ నెల 7న అన్ని గ్రామాల్లో సమితి జెండాలను ఎగరవేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ మాదిగ తెలిపారు. కడ్తాల మండలం సాలార్‌పూర్‌లో మంగళవారం వేడుకల సన్నాహక సమావేశం నిర్వహించారు. మండలాధ్యక్షుడు రమేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి కృష్ణ హాజరయ్యారు. ఎమ్మార్పీఎస్ జెండాగద్దె నిర్మాణానికి నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. మాదిగల ఆత్మగౌరవానికి ఎమ్మార్పీఎస్ జెండా ప్రతీక అన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధించిన మంద కృష్ణ మాదిగ చరిత్రలో నిలిచిపోతారని అన్నారు. కార్యక్రమంలో సమితి గ్రామ కమిటీ అధ్యక్షుడు రమేశ్, అంజయ్య, సిలారి, శ్రీను, మధు, రాజేశ్, శర్మ, శ్రీశైలం, రవి, లింగం, చెన్నయ్య పాల్గొన్నారు.

అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసిన
తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు


బొంరాస్‌పేట్, జూలై 1(ఆంధ్రజ్యోతి): పరిగి మండలం రంగంపల్లిలో ఎకరా ప్రభుత్వ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసి, అదే గ్రామంలో 20-23ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమార్కులకు కట్టబెట్టడం, గోవిందాపూర్‌లో 16ఎకరాల సీలింగ్ భూమిని అక్రమ రిజిస్ట్రేషన్ చేయడం, మట్టి వ్యాపారులతో కుమ్మక్కయి మట్టి వ్యాపారం చేస్తున్న పరిగి తహసీల్దార్ ఆనంద్‌రావును సస్పెండ్ చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వారు మంగళవారం బొంరాస్‌పేట్ తహసీల్దార్ పద్మావతికి వినతి పత్రం అందించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొత్తూర్ చంద్రయ్యలు మాట్లాడుతూ.. అవినీతి, అక్రమాలకు పాల్పడిన తహసీల్దార్‌ను డిస్మిస్ చేయాలన్నారు. ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పరిరక్షించాలి


పోతారంలో మొక్కలు నాటుతున్న మున్సిపల్ అధికారులు

మూడుచింతలపల్లి, జూలై1(ఆంధ్రజ్యోతి):ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషిచేయాలని మూడుచింతలపల్లి మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్ తెలిపారు. మంగళవారం మూడుచింతపల్లి మున్సిపాలిటీ పరిధి నాగిశెట్టిపల్లి, పోతారంలలో మొక్కలు నాటారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. మునిసిపాలిటీలో వంద రోజుల ప్రణాళికలో భాగంగా మొక్కలు నాటి సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. మొక్కలు నాటగానే సరిపోదని, సంరక్షించినప్పుడే మన కార్యక్రమానికి సార్థకత చేకూరుతుందన్నారు. అనంతరం నాగిశెట్టిపల్లిలో తడి, పొడి చెత్త నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు రామేశ్వరరావు, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మునిసిపల్ కమిషనర్



కీసర, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మాల్కాజిగిరి కలెక్టర్ మను చౌదరిని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా వెంకట్‌రెడ్డి మేడ్చల్ కలెక్టరేట్‌లో కలెక్టర్ మను చౌదరిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అదే విధంగా అదనపు కలెక్టర్ రాధికగుప్తాను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

మద్యం విక్రయాల నిషేధంపై నోటీసులు

కులకచర్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల మండలంలోని బండవెల్కిచర్లలో మద్యం విక్రయాల నిషేధంపై గ్రామస్తులు, యువకులు మంగళవారం తీర్మాన నోటీసులను బెల్టు షాపుల నిర్వాహకులకు, కిరాణా దుకాణాల యజమానులకు అందజేశారు. 'మనం బాగుండాలి. అందులో మనం ఉండాలి. మన గ్రామం ముందుండాలి' అనే నినాదంతో ముందుకు వెళ్తున్నామని యువకులు తెలిపారు. గ్రామంలో మద్యం విక్రయిస్తే రూ.1 లక్ష జరిమానా తప్పదని, విక్రయిస్తున్న వారిని పట్టిస్తే రూ.25వేలు అందిస్తామని ఈ సందర్భంగా గ్రామస్తులు, యువకులు తెలిపారు.


గ్రామంలో షాపు యజమానికి నోటీసు ఇస్తున్న యువకులు

'డబుల్' ఇళ్ల సమస్యలు పరిష్కరిస్తాం


సమావేశంలో డ్రగ్స్ నిర్మూలనపై మాట్లాడుతున్న శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్

శంకర్‌పల్లి, జూలై 1(ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేశ్ తెలిపారు. శంకర్‌పల్లిలోని డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల వద్ద ఆయన సీఐ శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి మంగళవారం లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరుచేసి చెత్తబండ్లలో వేయాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీఐ మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ చేయూతనందించాలని కోరారు. మాదక ద్రవ్యాల నిషేధంపై అవగాహన కల్పించి వారిచే ఆయన ప్రతిజ్ఞ చేయించారు. జీహెచ్ఎంసీ టూబీహెచ్‌కే ఏఈ రామకృష్ణ, మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

8లోగా రైతు రిజిస్ట్రీ చేయించుకోవాలి


యాచారం రైతు వేదికలో రైతు రిజిస్ట్రీ కోసం వచ్చిన రైతులు

యాచారం, జూలై1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు రిజిస్ట్రీని(రైతు ఐడీ) చేయించుకోవాలని. ఈ నెల 8వ తేదీ వరకు చేయించుకోవాలని యాచారం ఏవో రవినాథ్ తెలిపారు. రైతులు ఆధార్, ఫోన్ నంబర్లతో రైతు వేదికలో నమోదు చేసుకోవాలని కోరారు. రైతు రిజిస్ట్రీతోనే వ్యవసాయ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. సర్వే నంబర్ల వారీగా ఏ పంటలు వేశారో నమోదు చేసుకోవాలన్నారు. యాచారం, మేడిపల్లి గున్‌గల్, మాల్ క్లస్టర్ గ్రామాల రైతులు ఏఈవోల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు.

విరిగిన విద్యుత్ స్తంభంతో..
పొంచి ఉన్న ముప్పు

- ఎన్‌ఎఫ్‌సీ నగర్‌లో ప్రమాదకరంగా ఎలక్ట్రిక్ పోల్
- పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు

ఘట్‌కేసర్, జూలై 1(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభం విరిగి ఎప్పుడు కిందపడుతుందోనని స్థానికులు జంకుతున్నారు. విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఘట్‌కేసర్ పరిధి ఎన్‌ఎఫ్‌సీ నగర్ కాలనీలోని బి-2లో విద్యుత్ స్తంభం పైన విరిగింది. రాకపోకలు సాగించే రోడ్డు కావడంతో ఎప్పుడేప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయపడుతూ ప్రయాణం సాగిస్తున్నారు. ఆరు నెలలుగా విద్యుత్ అధికారులకు తెలియజేస్తున్నా కొత్త స్తంభాన్ని పాతడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. బలమైన గాలులు వీస్తే పోల్ విరిగిపడుతుందని, ప్రమాదం జరిగితేనే అధికారులు స్పందిస్తారా? అని ప్రశ్నిస్తున్నారు. నిత్యం షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు కాలిపోతున్నాయన్నారు. అస్తవ్యస్త విద్యుత్ లైన్లను సరిచేయాలని విన్నవిస్తున్నా పట్టించుకునే నాథుడులేడని అంటున్నారు. మూడు రోజుల క్రితం హైవోల్టేజీతో ఫ్రిడ్జ్‌లు, ఫ్యాన్లు, ఏసీలు, కూలర్లు, గ్రైండర్లు వంటి గృహోపకరణాలు కాలిపోయాయని తెలిపారు. ఇప్పటికైనా కొత్త స్తంభాన్ని పాతించి, నిత్యం ఏర్పడుతున్న షార్ట్ సర్క్యూట్ సమస్యను కూడా పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



విరిగిన విద్యుత్ స్తంభం ఇదే

నిత్యం భయపడుతున్నాం



ఎన్‌ఎఫ్‌సీనగర్ కాలనీ బి-2లో స్తంభం పైభాగం విరిగింది. ఎప్పుడు కిందపడి ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతన్నాం. ఈ సమస్యపై విద్యుత్ అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదు. ముప్పువాటిల్లక ముందే వారు స్పందించాలి.

-శోభారాణి, మాజీ ఉపసర్పంచ్, ఎన్‌ఎఫ్‌సీనగర్

మరమ్మతులు చేయిస్తాం



ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో విరిగిన విద్యుత్ స్తంభాన్ని మేం పరిశీలించాం. దానికి తొలగించి కొత్త స్తంభాన్ని పాతేందుకు చర్యలు తీసుకుంటాం. ఈ విషయాన్ని కాంట్రాక్టర్‌కు తెలియజేశాం. నిత్యం ఏదో చోట మరమ్మతులు జరుగుతున్నందున అలస్యమైంది. త్వరలో సమస్యను పరిష్కారిస్తాం.

- యశ్వంత్, ట్రాన్స్‌కో ఏఈ, ఘట్‌కేసర్

ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి
దరఖాస్తుల ఆహ్వానం



బషీరాబాద్, జూలై 1(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్‌లోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో బోధించేందుకు ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అనీల మంగళవారం తెలిపారు. పాఠశాలలోని కార్యాలయంలో విలేకరులతో ఆమె మట్లాడుతూ.. టీజీటీ-తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, సోషల్, ఫిజికల్ సైన్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల ఫ్యాకల్టీ పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. ఆయా సబ్జెక్టుల్లో బీఈడీ/టెట్ అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 4తేదీ లోపు ఆఫీసులో దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

ఎమ్మెల్యేలపై 'స్థానిక' భారం

- పార్టీ అభ్యర్థుల గెలుపు వారికి పరీక్ష
- తలనొప్పిగా మారనున్న బీసీ రిజర్వేషన్ల అమలు
- స్తబ్ధుగా ప్రతిపక్ష పార్టీలు



తాండూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఏడు ఏనిమిది నెలలుగా ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల హడావిడి రాజకీయ పార్టీల్లో మొదలైంది. కాంగ్రెస్ పార్టీ మాత్రం ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యతను ఎమ్మెల్యేలకు అప్పగించింది. అభ్యర్థులను గెలిపించుకొని ఎంపీపీలు, జెడ్పీ స్థానాలను చేజిక్కించుకుంటే వచ్చే సాధారణ ఎన్నికల్లో ఎమ్మెల్యేల గెలుపునకు ఎంతో ఉపయోగం అనే భావనలో పార్టీ రాష్ట్ర నేతలు ఉన్నారు. దీంతో స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యతను సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌లు ఎమ్మెల్యేలకు అప్పగించారు. మూడు నెలల్లో ఎన్నికలు పూర్తిచేయాలని హైకోర్టు సైతం రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో పాలక పార్టీ ఎమ్మెల్యేలు ఇప్పటి నుంచే వ్యూహాలు రచిస్తున్నారు. ఆయా చోట్ల బలమైన వ్యక్తి ఎవరు? రిజర్వేషన్ ప్రకారం ఎవరిని నిలబెట్టాలి? ప్రత్యర్థి పార్టీల బలాబలాలేమిటి? అనే అంశాలపై ఆరా తీస్తున్నారు. పార్టీ గుర్తుతో ఎన్నికలు నిర్వహించే ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను అత్యధికంగా గెలిచి ఎంపీపీలు, జెడ్పీ స్థానాలను కైవశం చేసుకోవాలని జిల్లా ఎమ్మెల్యేలు ఇప్పటి నుంచే కార్యరంగంలోకి దిగుతున్నారు. ఇప్పటికే కార్యకర్తలు, స్థానిక నాయకులతో మండలాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారు. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తన నియోజకవర్గంలో అన్ని ఎంపీపీలు, జెడ్పీటీసీ స్థానాల గెలుపునకు గట్టి అభ్యర్థుల వేటలో ఉన్నారు. కాగా కొత్తగా తెరపైకి వచ్చిన బీసీలకు 42శాతం సీట్లు కేటాయింపు అంశం పార్టీకి తలనొప్పిగా మారే అవకాశాలున్నాయి. బీసీ రిజర్వేషన్ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందితే మెజారిటీ సీట్లు బీసీలకు దక్కుతాయి. ఆమోదం పొందకున్నా మొత్తం స్థానాల్లో పార్టీ పరంగా అయినా బీసీలకు 42శాతం టికెట్లు ఇవ్వాలని కాంగ్రెస్ యోచిస్తున్నట్లు సమాచారం. అయితే బీసీలకు కేటాయించిన స్థానాల్లో ఓసీ అభ్యర్థులు నిలబడినా తట్టుకొని గెలిపించుకునేలా అభ్యర్థులను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఈ విషయంలో పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు ఇప్పటి నుంచే కసరత్తు చేపట్టారు. ఇదిలా ఉంటే ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు స్థానిక సంస్థలకు ఇంకా సన్నద్ధం కావడంలేదనే చెప్పాలి. ఎన్నికలను ఎదుర్కొనేందుకు ప్రణాళిక రూపొందించడంలో ఆ పార్టీలు వెనుకబడ్డాయి. అధికార కాంగ్రెస్ చేపడుతున్నంతగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించడం లేదు. తాండూరు నియోజకవర్గంలో పెద్దేముల్, యలాల, తాండూరు, బషీరాబాద్ మండలాల్లో 53 ఎంపీటీసీ, నాలుగు జెడ్పీటీసీ స్థానాలున్నాయి. అధికారులు ఎన్నికల ప్రక్రియకు సన్నద్ధమవుతున్న పరిస్థితులు కన్పిస్తున్నాయి.

ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటుతాం


కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటుతున్న జిల్లా లీడ్ బ్యాంక్ అధికారులు, సిబ్బంది

మేడ్చల్, జూలై1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి):వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో దాదాపు 500 మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సి.శివప్రసాద్ తెలిపారు. మంగళవారం కెనరా బ్యాంక్ 120వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్ ఆవరణలో శివప్రసాద్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. డీఎస్‌డీవో వినోద్‌కుమార్, డీఆర్‌డీఏ సూపరింటెండెంట్ పారిజాతం, జేడీఎం దివాకర్, డీపీఎంలు, రెవెన్యూ ఉద్యోగి టి.సంతోష్ కుమార్, స్పోర్ట్స్ ఆఫీస్ సిబ్బంది పాల్గొని వివిధ రకాల పండ్ల మొక్కలను నాటారు.

'కుల వృత్తిని కాపాడుకుంటాం'

వికారాబాద్, జూలై 1(ఆంధ్రజ్యోతి): తమ కుల వృత్తిని కాపాడుకుంటామని, అవసరమైతే కోర్టుకు వెళ్తామని ప్రొఫెసర్ నాగయ్య అన్నారు. వికారాబాద్ కలెక్టరేట్‌లో మంగళవారం నాయీబ్రాహ్మణులతో కలిసి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాం కాలంలో మంగలి, చాకలి, వడ్ల, కమ్మరి, కంచరి, ఊరడితో పాటు మొత్తం 12కుల వృత్తుల వారికి ఇనామ్‌లు ఇచ్చారని తెలిపారు. ఇవన్నీ ప్రజలకు సేవ చేసే కులాలని పేర్కొన్నారు. ఈ కులాలు వృత్తి ధర్మాన్ని చాటేవారని అన్నారు. కుల వృత్తుల వారి ఆవశ్యకతపై, వారు ప్రజలకు చేస్తున్న సేవలపై నాడే ప్రముఖ కవి దాశరథి రంగాచార్యులు ఎంతో గొప్పగా చెప్పారని గుర్తుచేశారు. నాయీ బ్రాహ్మణులకు ఐదు వృత్తులు ఉన్నాయని, ఇప్పుడు తమ వృత్తిలోకి వేరే వారు చొరబడుతూ ఉపాధిని లాగేస్తున్నారన్నారు. ఇప్పుడు తామేం చేయాలని ప్రశ్నించారు. ఇతర కులస్తులు సెలూన్లు నిర్వహించడంపై కోర్టుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో పట్టణ నాయీ బ్రాహ్మణులు పాల్గొన్నారు.

పాలకులు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి


కందుకూరులో కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన మాటను పాలకులు నిలబెట్టుకొని నెరవేర్చాలని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగలేదని సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలుచేయకపోవడం సరికాదని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా రెడ్డి అన్నారు. వివిధ గ్రామాల లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంగళవారం మండల పరిషత్‌లో అందజేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకం కింద మొదట రూ.51వేలు, అనంతరం దానికి రూ.లక్ష ఒక్క వెయ్యికి పెంచారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ మొస్తే లక్ష నగదు, తులం బంగారం ఇస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు ప్రకటించారని, దానిని నేటికీ అమలుచేయకపోవడం అన్యాయమన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే 31మందికి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ కృష్ణానాయక్, ప్యాక్స్ ఛైర్మన్ డి.చంద్రశేఖర్, డైరక్టర్లు ఆనంద్, శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ కె.గోపాల్, డీటీ శేఖర్, ఆర్ఐలు యాదగిరి, శ్రీకాంత్, నాయకులు సురేందర్‌రెడ్డి, జి.లక్ష్మీనర్సింహారెడ్డి, జయేందర్, ఎస్.రాజశేఖర్‌రెడ్డి, లచ్చ్యానాయక్, మేఘనాథ్‌రెడ్డి, కె.రామక్రిష్ణారెడ్డి, వై.శ్రీనివాస్, కె.సదానంద్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, చంద్రశేఖర్, భూపాల్‌రెడ్డి, జంగయ్య, బాబు, ఇందిరదేవేందర్, సురేష్, కె.రాములు, ప్రకాశ్‌రెడ్డి, దేవీలాల్, కార్తీక్, దీక్షత్‌రెడ్డి, సామయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల
ఏర్పాటు అభినందనీయం


ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సందర్శించిన నర్సిరెడ్డి

మంచాల, జూలై1(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో తెలంగాణ పబ్లిక్‌స్కూల్స్ ఏర్పాటు అభినందనీయమని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తెలంగాణ పబ్లిక్ స్కూల్(టీపీఎస్‌వీ) బృందంతో కలిసి మండలంలోని ఆరుట్ల పాఠశాలను సందర్శించారు. ఇక్కడ పాఠశాలలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజల మధ్య అంతరాలను తొలగించేందుకు విద్య దోహదపడుతుందన్నారు. రాష్ట్రంలో మొదటిసారి ఆరుట్లలో పబ్లిక్‌స్కూల్ ఏర్పాటు సంతోషకరమన్నారు. తన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ పౌరస్పందన వేదిక సమాజంలో మంచిని పెంచేందుకు కృషిచేస్తోందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం గిరిధర్‌గౌడ్, సుప్రియ, మోహన్‌గౌడ్, పేరెంట్స్ కమిటీ సభ్యులు కె.భాస్కర్, నూకం రాజు, జానీపాషా, జంగయ్య, మల్లేశ్, పార్వతి, జ్యోతి, టీచర్లు పాపిరెడ్డి, కిషన్‌చౌహాన్, శ్రీకాంత్, జహీర్ ఉన్నారు.

దంచికొట్టిన వాన

(3వ పేజీ తరువాయి)

42.5మి.మీ. వర్షం కురిసింది. మామిడిపల్లిలో 40.8, ఎయిర్‌పోర్ట్ వద్ద 38.5, రాచలూరులో 37.5, ధారూరులో 36.3, కోట్‌పల్లిలో 35.8, వికారాబాద్‌లో 35.3, పరిగిలో 33.8, ఎలిమినేడులో 33.3, దోమలో 33.0 మి.మీ వర్షం కురిసింది. అమీర్‌పేట్‌లో 33.0, పెద్ద ఉమ్మెంతాల్‌లో 31.3, మాంఖాల్ ఇండస్ట్రియల్ ఏరియాలో 31.0, నందిగామలో 30.8, దండు మైలారంలో 30.8, మహేశ్వరంలో 30.5 మి.మీ. వర్షం కురిసింది. ఇదిలా ఉంటే, గత కొన్ని రోజులుగా వర్షాలు కురియక అన్నదాతలు దిగాలుగా ఉన్న విషయం విదితమే. విత్తనాలు విత్తుకున్న రైతులు వరుణుడి కరుణ కోసం ఎదురు చూస్తున్నారు. విత్తనాలు విత్తుకున్న తర్వాత వర్షం కురియక కొందరు.. వర్షం లేక కొత్తగా రైతులు విత్తనాలు విత్తుకోలేక ఆవేదన చెందుతున్న విషయం తెలిసిందే. వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులు మంగళవారం కురిసిన వర్షంతో కొంత ఊరట చెందారు.

రెండు గంటల పాటు...

యాచారం/చౌదరిగూడ: యాచారం మండలంలోని యాచారం, నందివనపర్తి, కుర్మిద్ద, చౌదర్‌పల్లి, గున్‌గల్, మాల్ గ్రామాల్లో కుంభవృష్టి కురిసింది. మంగళవారం రాత్రి ఏడున్నర గంటలకు వర్షం మొదలై రెండున్నర గంటలపాటు వర్షం కురిసింది. ఈ వానాకాలంలో ఇదే భారీ వర్షం. వర్షంతో సాగర్-హైదరాబాద్ రహదారిపై పలుచోట్ల వాహనాలు నిలిచిపోయాయి. యాచారం పెట్రో మొబైల్ 1, 2 పోలీసులు వాహనాల డ్రైవర్లను సూచనలు చేశారు. యాచారంలో రోడ్డుపై వరద నిలిచింది. నందివనపర్తి వెళ్లేదారిలో భారీ గుంతలుండడంతో ఆటో డ్రైవర్లు ఇబ్బందులు పడ్డారు. నజ్దిక్‌సింగారంలో అలుగు వద్ద వరద నీరు నిలిచింది. మాల్‌లో సాగర్-హైదరాబాద్ రహదారిపై వాహనదారులు అవస్థలు పడ్డారు. జిల్లేడ్ చౌదరిగూడ, కొందుర్గు మండలాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లపై వరద నీరు చేరడంతో ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.


వికారాబాద్‌లో కురుస్తున్న వర్షం

రైతు బజారులో అవస్థలు

వికారాబాద్/ధారూరు/బొంరాస్‌పేట్/చౌడాపూర్: వికారాబాద్ జిల్లాలోని వికారాబాద్, ధారూరు, బొంరాస్‌పేట్, చౌడాపూర్ మండలాల్లో వర్షం కురిసింది. ఈ వర్షంతో పంటలకు ప్రాణమొచ్చినట్లు అయిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వికారాబాద్‌లో భారీ వర్షానికి రైతుబజార్ అస్తవ్యస్తంగా మారింది. దీంతో కూరగాయలు అమ్ముకునే రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. కూరగాయలు నీటిలో కొట్టుకుపోయాయి. ఇక్కడ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కోసం గతంలో పనులు చేపట్టిన పనులు మధ్యలోనే ఆగిపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు మార్కెట్ పనులు ప్రారంభమయ్యేలా చూడాలని కోరుతున్నారు.

ధారూరులో విద్యుత్ సరఫరా బంద్

ధారూరు మండలంలో మంగళవారం తెల్లవారుజాము వరకు కుండపోత వర్షం కురిసింది. ఈ వర్షం పంటలకు మేలు చేకూర్చింది. వర్షం ప్రారంభమైన వెంటనే ధారూరు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్షం పడితే గంటల తరబడి కరెంట్ కట్ అవుతోందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం రాత్రి కురిసిన వానకు తాండూరు నుంచి సబ్‌స్టేషన్‌కు సరఫరా నిలిచి మంగళవారం ఉదయం వరకు రాలేదు. ట్రాన్స్‌కో సిబ్బంది మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వికారాబాద్ నుంచి ప్రత్యామ్నాయ లైన్ ఏర్పాటు చేయాలంటున్నారు.

గిర్మాపూర్‌నకు బస్సు సర్వీసు ప్రారంభం

పెద్దేముల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): గిర్మాపూర్ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గిర్మాపూర్ గ్రామం కొన్నేళ్లుగా ఆర్టీసీ బస్సు సౌకర్యానికి నోచుకోలేదు. గతంలో ఒకసారి బస్సు వేసి 15రోజులు సర్వీసును కొనసాగించారు. ఆతరువాత రద్దు చేశారు. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని రోజులుగా గ్రామస్తులు, నాయకులు గిర్మాపూర్ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని కోరారు. ఎమ్మెల్యే స్పందించి మంగళవారం నుంచి గ్రామానికి బస్సు సర్వీసు వేయించారు. తాండూరు నుంచి గౌతాపూర్, చెంగోల్‌మీదుగా గిర్మాపూర్ చేరుకుని తిరిగి అదే రూటులో తాండూరు వెళ్తుంది. గ్రామానికి వచ్చిన బస్సుకు గ్రామస్తులు కొబ్బరికాయలు కొట్టి స్వాగతం పలికారు. సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



కొబ్బరికాయ కొట్టి బస్సుకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్

'ఉల్లాస్'తో సంపూర్ణ అక్షరాస్యత

కేశంపేట, జూలై1(ఆంధ్రజ్యోతి): ఉల్లాస్ యాప్‌తో సంపూర్ణ అక్షరాస్యత దిశగా ముందుకుసాగాలని ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్ తెలిపారు. నవభారత్ సాక్షరత కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యావకాశం కోల్పోయి 15 సంవత్సరాలు, ఆపై బడిన నిరక్షరాస్యులకు జాతీయ విద్యా విధానానికనుగుణంగా నిర్వహించే ఉల్లాస్ (సమాజంలో అందరికీ జీవిత కాల అభ్యాసం యొక్క అవగాహన) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో మంగళవారం ఉల్లాస్ యాప్‌పై వాలంటర్ టీచర్లకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. విద్యనభ్యసించే వారిని టీచర్లను యాప్‌లో ఎలా ట్యాగ్ చేయాలో ఆర్పీ శరత్‌చంద్ర చూపించారు. అనంతరం ఇన్‌చార్జి ఎంఈవో మాట్లాడుతూ అక్షరాస్యతకు దూరమైన వారికి ప్రాథమిక విద్య, సంఖ్యా శాస్త్రాన్ని బోధించాలని తెలిపారు. ఇన్‌చార్జీ ఎంపీడీవో కిష్టయ్య, ఏపీఎం భగవంతు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు పశుగ్రాసం వితరణ



షాద్‌నగర్ అర్బన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మున్సిపాలిటీలోని చౌడమ్మగుట్ట వద్ద నిర్వహిస్తున్న శ్రీ కృష్ణ గోశాలకు దేవునిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ చేగూరి రాఘవేందర్‌గౌడ్ ట్రాక్టర్ వరిగడ్డిని దానం చేశారు. మంగళవారం పశుగ్రాసాన్ని తీసుకువెళ్లి గోశాల వద్ద అందజేశారు. రంఘవేందర్‌గౌడ్‌ను ఆంజనేయస్వామి ఆలయం పూజారి రాఘవేందర్ చారి, గోశాల నిర్వహణ కమిటీ సభ్యుడు లక్ష్మయ్యలు అభినందించారు.

ధరణితో ఊరు మాయం!?

(మూడో పేజీ తరువాయి)

పైగా ప్రభుత్వ భూమి ఉంది. ధరణి రాకముందు శేరిగూడబద్రాయ పల్లిలో రైతులకు ఎటువంటి సమస్యలు ఎదురుకాలేదు. ధరణి వచ్చిన తర్వాత పలువురు రైతులకు చెందిన భూములు ప్రొహిబిటెడ్ లిస్ట్‌లో పడ్డాయి. రెండు రెవెన్యూ గ్రామాల్లో ప్రభుత్వ భూములకు, పట్టా భూములకు ఒకే సర్వే నంబర్లు లింకై ఉన్నాయి. అలాగే భూ సర్వే కోసం, రఖాస్తు చేసుకోడానికి మీ సేవకు వెళ్తే.. విలేజ్ డాటా నాట్ అవైలబుల్ అని వస్తుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అలాగే క్రయ, విక్రయాలు కూడా జరగడం లేదు. దాదాపు 10 సర్వే నంబర్లల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. శేరిగూడ, బదాయపల్లి గ్రామాలకు చెందిన పలు సర్వే నంబర్లు ఒకటే నంబర్‌తో ఉండడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. తమ సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వాపోతున్నారు.

త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం



శేరిగూడబద్రాయపల్లిలో నెలకొన్న సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. ఇటీవల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కూడా పలువురు రైతులు మా దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యపై జిల్లా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నాం.

\- రవీందర్‌రెడ్డి, తహసీల్దార్, కొత్తూర్

కళాశాలల బంద్‌ను జయప్రదం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

చేవెళ్ల, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పట్నం శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 72 గంటల కళాశాలల బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. చేవెళ్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జూలై 2, 3, 4వ తేదీల్లో నిర్వహించబోయే 72 గంటల కళాశాలల బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. 20204-25 విద్యాసవంత్సరానికి సంబంధించిన ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు సుమారు రూ. 7,200 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 18 నెలలు గడుస్తున్నా అరకొర నిధులు కేటాయించడం తప్ప.. పూర్తిస్థాయిలో ఇవ్వలేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చదువుకు పేదరికం అడ్డుకాదు

తలకొండపల్లి, జూలై 1(ఆంధ్రజ్యోతి): చదువుకు పేదరికం అడ్డుకాదని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు డాక్టర్ ఉప్పల అనిల్, అఖిల్‌లు అన్నారు. పేద విద్యార్థుల విద్యాభ్యున్నతికి ప్రతీ ఒక్కరు తోడ్పాటునందించి ప్రోత్సహించాలని సూచించారు. కల్వకుర్తి మున్సిపాలిటీకి చెందిన నందిని నీట్ కోచింగ్‌కు ఆర్థిక ఇబ్బంది పడుతోంది. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ స్పందించారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నందినికి లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు రూ.20 వేలు సమకూర్చారు. మంగళవారం హైదరాబాద్‌లో ట్రస్ట్ సభ్యులు డాక్టర్ అఖిల్, అనిల్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్‌యాదవ్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రూ.2 లక్షల విలువైన పంచలోహ విగ్రహాలు చోరీ

ఇబ్రహీంపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధి పోల్కంపల్లిలో సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ఆలయాల్లో చోరీకి పాల్పడి రెండు లక్షల విలువచేసే పంచలోహ విగ్రహాలను ఎత్తుకెళ్లారు. పెద్దమ్మ, గంగాదేవి ఆలయంలో తాళాలు పగులగొట్టి అమ్మవారి పంచలోహ విగ్రహాలు, రామాలయంలో రామ, లక్ష్మణ, సీతాదేవి, ఆంజనేయస్వామి విగ్రహాలను ఎత్తుకెళ్లారు. కాగా, పది రోజుల క్రితమే పెద్దమ్మ, గంగాదేవి ఉత్సవాలు జరిగాయి. మంగళవారం ఉదయం సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై చందర్‌సింగ్‌లు తమ సిబ్బందితో ఘటనా స్థలాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

ముగ్గురు బాల కార్మికులకు విముక్తి

ఆదిభట్ల, జూలై 1(ఆంధ్రజ్యోతి): ముస్కాన్ టీం ముగ్గురు బాలకార్మికులకు విముక్తి కలిగించిన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ముస్కాన్ టీం ఎస్సై రామకృష్ణ, చైల్డ్ ప్రొటెక్షన్ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన ముగ్గురు బాలకార్మికులను పట్టుకున్నట్లు తెలిపారు. పోలీసుస్టేషన్ పరిధిలోని రాగన్నగూడ సమీపంలోని విఘ్నేశ్వర వీల్స్ టెక్ కంపెనీలో పనిచేస్తున్న ఇద్దరు కార్మికులను, తుర్కయంజాల్ బ్రాహ్మణపల్లి ఎక్స్‌రోడ్డు దగ్గర ఉన్న ఆద్య కన్‌స్ట్రక్షన్‌లో పనిచేస్తున్న మరో బాలకార్మికుడికి విముక్తి కలిగించినట్లు తెలిపారు. ఈమేరకు ఆదిభట్ల పోలీసులు ఆయా కంపెనీల యాజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

భూ ఆక్రమణలకు పాల్పడితే సహించేది లేదు

షాద్‌నగర్ రూరల్, జూలై1(ఆంధ్రజ్యోతి): రైతుల భూములను అక్రమ మార్గాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుంటే సహించేది లేదని ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ హెచ్చరించారు. తమ భూములను తప్పుడు పద్ధతుల్లో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకోగా.. రద్దు చేయించినందుకు ఫరూక్‌నగర్ మండలం చిల్కమర్రికి చెందిన మహిళా రైతు వినోద, మరో రైతు నర్సింహారెడ్డి గ్రామస్థులతో కలిసి మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శంకర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అదే గ్రామానికి చెందిన కొత్తపల్లి సుభాన్‌రెడ్డి, కొత్తపల్లి మధుసూదన్‌రెడ్డి తమ కోడలైన వినోద భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. అలాగే కొత్తపల్లి నర్సింహారెడ్డి భార్య నవనీత భర్త పేరున ఉన్న భూమిని అక్రమంగా పట్టా మార్పిడి చేయించుకున్నారని తెలిపారు. ఆ రిజిస్ట్రేషన్ల విషయం తన దృష్టికి వచ్చిన వెంటనే ఆర్డీవో, కలెక్టర్‌తో మాట్లాడి రద్దు చేయించినట్లు ఎమ్మెల్యే వివరించారు. కాంగ్రెస్ నాయకులు రవీందర్‌రెడ్డి, కృష్ణయ్య తదితరులు ఎమ్మెల్యేను కలిశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న గడ్డం శేఖర్‌యాదవ్

శంషాబాద్ రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కవ్వగూడలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ దేవాలయ నిర్మాణానికి మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గడ్డం శేఖర్‌యాదవ్ రూ.50 వేల విరాళం కమిటీకి అందజేశారు. అనంతరం ఆలయ పనులను పరిశీలించారు. శేఖర్ యాదవ్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పోచయ్య, రత్నం, కృష్ణ, రాకేష్, దర్శన్, రఘు, సత్యం, రామచంద్రయ్య, శ్రీరాములు, గ్రామస్థులు తదితరులున్నారు.

ఇష్టారాజ్యంగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు



డీఈకి వినతిపత్రాన్ని ఇస్తున్న హరినాథ్‌రెడ్డి

కొత్తూర్, జూలై 1(ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవాడ పాత జాతీయ రహదారి నుంచి తీగాపూర్ గ్రామ శివారులోని ఓ పరిశ్రమకు విద్యుత్ సరఫరా కోసం వేస్తున్న స్తంభాలు ఇష్టారాజ్యంగా వేస్తున్నారని, వెంటనే పనులు నిలిపి వేయాలని కోరుతూ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్థులు షాద్‌నగర్ విద్యుత్ శాఖ డీఈ శ్యాంసుందర్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. కాంట్రాక్టర్ విద్యుత్ స్తంభాలను సీసీ రోడ్డుకు ఆనుకొని పాతుతున్నాడని, దాంతో వైర్లు రోడ్డుపైకి వచ్చే అవకాశం ఉందన్నారు. పారిశ్రామికవాడ-తీగాపూర్ రోడ్డు నిత్యం వందలాది వాహనాలు వచ్చి వెళ్తుంటాయని, ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటుందన్నారు. రోడ్డుకు దూరంగా విద్యుత్ స్తంభాలు పాతించాలని కోరారు. ఇందుకు డీఈ సానుకూలంగా స్పందించారని హరినాథ్‌రెడ్డి పేర్కొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేద్దాం

షాబాద్/కేశంపేట/కందుకూరు, చేవెళ్ల జూలై 1(ఆంధ్రజ్యోతి): నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా ఈనెల 9న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేద్దా మని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ పిలుపునిచ్చారు. చందన్‌వెల్లి పీహెచ్‌సీలో సీహెచ్‌వోకు, ఆలూరులో మెడికల్ ఆఫీసర్‌కు మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. ఆయన మాట్లాడుతూ శతాబ్ద కాలంగా కార్మికవర్గం అనేక త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి వాటి అమలుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తుందన్నారు. చేవెళ్ల మండల ఆశావర్కర్ల యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు అన్నపూర్ణ, విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలు శాంతగీత హేమలత తదితరులు పాల్గొన్నారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ కేశంపేట మండల కన్వీనర్ బేరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలతో కలిసి డాక్టర్ నిఖితకు సమ్మె నోటీసు అందించారు. ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు శ్రీలత, ఆశాలు తదితరులు పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను మరింత పటిష్టంగా అమలు చేయాలని సీఐటీయు కందుకూరు మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. ఆశావర్కర్లతో కలిసి కందుకూరు, రాచులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులకు సమ్మె నోటీసు అందజేశారు. ఆశావర్కర్లు ముంతాజ్‌బేగం, శ్రీతల, రాధిక, లక్ష్మమ్మ, యాదమ్మ, జయసుధ, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల వికాసానికి పౌష్టికాహారం ముఖ్యం

హైదరాబాద్, జూలై 1(ఆంధ్రజ్యోతి): చిన్నారుల వికాసానికి పౌష్టికాహారం ఎంతో ముఖ్యమని ఏడీపీ ఇండియా ఎండీ విజయ్ వేములపల్లి అన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా అక్షయపాత్ర ఫౌండేషన్‌తో కలిసి ఏడీపీ ఇండియా దేశవ్యాప్తంగా సర్కార్ స్కూళ్లలో చదువుతున్న 5,800 మందికి ఏడాదిపాటు భోజనాలు అందించనుంది. మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌లోని ఓ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం 150మందికి మధ్యాహ్న భోజనమందించడంతో కార్యక్రమం ప్రారంభించారు.

నాయకుడి ఉదారత.. తాగునీటి బోరు ఏర్పాటు



పెంజర్లలో బోరు వేయిస్తున్న సిద్ధార్థరెడ్డి

కొత్తూర్, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో నెలకొన్న మంచినీటి సమస్యను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మామిడి సిద్ధార్థరెడ్డి రూ.లక్ష వెచ్చించి మంగళవారం తాగునీటి బోరును ఏర్పాటు చేయించారు. గ్రామంలోని బీసీ కాలనీవాసులు మంచినీటి సమస్యపై సిద్ధార్థరెడ్డి దృష్టికి తీసుకరాగా, స్పందించి బోరు వేయించారు. బోరులో నీరు సమృద్ధిగా పడటంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేసి సిద్ధార్థరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన సొంత డబ్బుతో 20విద్యుత్ స్తంభాలు, స్ట్రీట్‌లైట్లు వేయించి ఉదారత చాటుకున్నా డు. ఉపసర్పంచ్ పాముల రమేష్, లచ్చిరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

వైద్య వృత్తి పవిత్రమైనది : ఎమ్మెల్యే



షాద్‌నగర్ అర్బన్ : వైద్యులను సన్మానించిన ఎమ్మెల్యే శంకర్



మహేశ్వరం : తుక్కుగూడలో పరీక్షలు చేస్తున్న విశిష్ట ఆసుపత్రి వైద్యుడు రాందాస్‌నాయక్

షాద్‌నగర్ అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నవమాసాలు మోసి అమ్మ జన్మనిస్తే.. వైద్యులు పునర్జన్మనిస్తున్నారని, వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. షాద్‌నగర్ ఐఎంఏ ఆఫీసులో మంగళవారం ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ నాగవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన డాక్టర్స్ డే కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై వైద్యులను సన్మానించి, అభినందనలు తెలిపారు. వైద్యులపై జరుగుతున్న దాడులను, దౌర్జన్యాలను అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే శంకర్ హామీ ఇచ్చారు. డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ చందు లాల్ రాథోడ్, డాక్టర్ కార్తీక్, డాక్టర్ ప్రతాప్‌కుమార్, డాక్టర్ మల్లప్ప, డాక్టర్ దిలీప్‌చంద్ర, డాక్టర్ రమేష్ బండారి, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ కి రణ్, అరుణ్, డాక్టర్ దయానంద్, డాక్టర్ వీణ, డాక్టర్ అనీ ల, డాక్టర్ నిహారిక, డాక్టర్ సుప్రియ తదితరులున్నారు. కాగా, షాద్‌నగర్ బుగ్గారెడ్డి గార్డెన్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ షాద్‌నగర్ టౌన్, లయన్స్ క్లబ్ ఆఫ్ షాద్‌నగర్ స్టార్స్, లయన్స్ క్లబ్ ఆఫ్ మానుకోట బేరల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. డాక్టర్స్ డే సందర్భంగా వేదికపై ఉన్న వైద్యులను సన్మానించి, అభినందనలు తెలిపారు. లయన్ మనోహర్‌రెడ్డి, లయన్ మదన్‌మోహన్ రెడ్డి, లయన్ చెంది మహేందర్‌రెడ్డి, లయన్ దండు శరత్‌చంద్రబాబు, లయన్ కమ్మదనం సుధాకర్, లయన్ రవీందర్‌రెడ్డి, లయన్ శాంతి లాల్‌పటేల్, లయన్ సాయికృష్ణ, లయన్ నారాయణ, లయన్ కమ్మదనం సందీప్, లయన్ బి.అశ్విన్ పటేల్, లయన్ ఎం. రాంచందర్, లయన్ డి. రెడ్డినాయక్, లయన్ కమ్మదనం సాయి వివేక్, లయన్ ఎం. అశోక్, లయన్ దరావత్ బాలు, లయన్ బాలబ్రహ్మచారి, లయన్ కె. ప్రదీప్ తదితరులున్నారు.

ఆమనగల్లు : సమాజంలో వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, కార్యదర్శి గంప శ్రీనులు అన్నారు. ఆమనగల్లు పట్టణంలో డాక్టర్స్ డే వేడుకలు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ నాగరాజు, మంజులాదేవి, మైమూన, పల్లె ఆసుపత్రుల వైద్యులు విజయలక్ష్మి, విజయ, రచనసింగ్, పత్యానాయక్‌లను సత్కరించారు. వైద్య సిబ్బంది తిరుపతిరెడ్డి, నాగేశ్వరి, ఇందిరా, జ్యోతి, ఆశా కార్యకర్తలు, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ నటరాజ్ యాదయ్య, పీఆర్‌వో ఎం.ఏ పాషా, కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లి : మండల కేంద్రంలో డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ కృష్ణ, డాక్టర్ రవి, గ్రామీణ వైద్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. డాక్టర్ కృష్ణకేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. వైద్యులను నాయకులు సత్కరించి అభినందించారు. కండె ఓంకారం, సత్యం, రమేశ్‌ప్రసాద్, శివకుమార్, శివకృష్ణ, కృష్ణ, ప్రభాకర్, లక్ష్మయ్య, పాండు, తదితరులున్నారు.



ఆమనగల్లు : డాక్టర్లను సన్మానించిన గోవర్ధన్‌రెడ్డి, యాదయ్య

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

మహేశ్వరం, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్యశిబిరాలను వినియోగించుకోవాలని, అతి తక్కువ ఫీజు తో పాటు పేదలకు ఉచిత వైద్య సేవలందించాలనే లక్ష్యంతో తుక్కుగూడలో విశిష్ట మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభించినట్లు డాక్టర్ రాందాస్‌నాయక్ తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా మంగళవారం విశిష్ట ఆసుపత్రిలో పేదలకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గ ప్రజలకు తక్కువ ఫీజులతో నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. అదేవిధంగా తుక్కుగూడలోని కొండేటా ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో డాక్టర్స్ డే సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. వైద్యులు ప్రమోద్‌కుమార్, సౌమ్య, దీప్తి, కొండేటి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

యాచారం : డాక్టర్ల దినోత్సవం సందర్భంగా నజ్దిక్‌సింగారంలోని ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ ఇందిరను పలువురు గ్రామపెద్దలు శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. పాండురంగారెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రికి నూతన భవనం కట్టించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యపరంగా ఎలాంటి ఇబ్బంది వచ్చినా తమ దృష్టికి తేవాలని సూచించారు.



యాచారం : నజ్దిక్‌సింగారంలో ఆయుర్వేద వైద్యురాలు ఇందిరను సత్కరిస్తున్న గ్రామస్థులు

చదువుతోనే ఉన్నత జీవితం

ఆమనగల్లు, జూలై 1(ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉన్నత జీవితంగా జీవిస్తారని సంఘసేవకుడు పాపిశెట్టి రాము అన్నారు. గాజులోని బావి తండాకు చెందిన రామావత్ రవినాయక్ కుమారుడు తరుణ్ జేఈఈ ప్రవేశపరీక్షలో జాతీయ స్థాయిలో 56వ ర్యాంక్ సాధించాడు. మంగళవారం ఆమనగల్లు పట్టణంలో తరుణ్‌కు రాము ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఉన్నత విద్యకు తనవంతు ప్రోత్సాహకాన్ని అందిస్తానని తెలిపారు. శృతిలయ కల్చరల్ అకాడమీ చైర్మన్ దార్ల చిత్తరంజన్‌దాస్, నాయకులు భాస్కర్, శ్రీను, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



తరుణ్‌ను సత్కరిస్తున్న పాపిశెట్టి రాము

నియోజకవర్గం బీసీ సంఘం అధ్యక్షుడిగా వెంకటయ్య



ఆర్.కృష్ణయ్య నుంచి నియామకపత్రం అందుకుంటున్న వెంకటయ్య

శంకర్‌పల్లి, జూలై 1(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షుడిగా మోకిల గ్రామానికి చెందిన బండమీది వెంకటయ్య నియమితులయ్యారు. ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య చేతుల మీదుగా ఆయన నివాసంలో మంగళవారం వెంకటయ్య నియామకపత్రం అందుకున్నారు. వెంకటయ్య మాట్లాడుతూ బీసీల అభివృద్ధి, సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షుడిగా నియమించిన ఆర్.కృష్ణయ్యతో పాటు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు.

బుడగ జంగాల మండల కమిటీ

చౌదరిగూడ, జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ బుడగ జంగాల మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం మండల కేంద్రంలో బుడగ జంగాల పోరాట సమితి గౌరవాధ్యక్షుడు నర్సింహులు, మొగులయ్యల ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి మండల కమిటీని ఎన్నుకున్నారు. జిల్లేడ్ చౌదరిగూడ నూతన కమిటీ మండలాధ్యక్షుడిగా సైదులు, ఉపాధ్యక్షుడిగా వెంకటేష్, ప్రధాన కార్యదర్శిలుగా శ్రీను, నర్సింహులు కోశాధికారిగా వెంకట్రాములు, ఆంజనేయులులతోపాటు కొంతమందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. నాయకులు రెలింగం, అంజయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారుత

బీజేపీ చీఫ్‌కు శుభాకాంక్షల వెల్లువ



శంషాబాద్ రూరల్ : రాంచందర్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న వేణుగోపాల్

శంషాబాద్ రూరల్/యాచారం/చేవెళ్ల, జూలై 1(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రాంచందర్‌రావును మంగళవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బుక్క వేణుగోపాల్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాంచందర్‌రావు మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించినట్లు ఆయన తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని సూచించినట్లు చెప్పారు. బీజేపీ జిల్లా నేతలు కుమార్‌యాదవ్, బుర్కుంట గోపాల్, సంజీవ, జూకల్ మాజీ ఎంపీటీసీ ప్రవీణ్‌కుమార్, కిట్టు తదితరులు పాల్గొన్నారు. అలాగే రాంచందర్ రావు ప్రమాణ స్వీకారోత్సవానికి యాచారం మండల బీజేపీ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులు యాచారంలో ర్యాలీ నిర్వహించారు. నరేంద్రమోదీ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినదించారు. మండలాధ్యక్షుడు విజయ్‌నాయక్, మాజీ అధ్యక్షుడు తాండ్ర రవీందర్‌ల ఆధ్వర్యంలో విజయ్‌నాయక్, నడికూడి కృష్ణ, రమేష్, జిల్లా లీగల్‌సె ల్ కన్వీనర్ పగడాల శ్రీశైలం, కిషన్, నర్సింహ, శివ మోడీ తదితరులు నగరానికి తరలివెళ్లారు.

అధ్యక్షుడిగా రాంచందర్‌రావును నియమించడం సంతోషం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రాంచందర్‌రావును నియమించడం సంతోషకరమని బీజేపీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల పట్టణంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్టీకి 40 సంవత్సరాలుగా ఆయన ఎన్నో సేవలందించారని గుర్తుచేశారు. విద్యార్థి దశ నుంచి జాతీయవాదంతో ఉద్యమాలు చేశారని, పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఉంటూ నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని గుర్తుచేశారు. జిల్లా కౌన్సిల్ సభ్యుడు శర్వలింగం, నాయకులు ఆంజనేయులుగౌడ్, శివశంకర్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, అశోక్, చంద్రశేఖర్‌రెడ్డి, గణేష్, మహేశ్వర్ రెడ్డి, సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

ఆమనగల్లు : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భద్రాద్రి జిల్లా లక్ష్మీదేవి పల్లి మండలం ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ రాజేశ్ కుటుంబానికి ప్రభుత్వం రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకోవాలని మండల సమన్వయ కర్తల సంఘం అధ్యక్షుడు సాయికుమార్ డిమాండ్ చేశారు. ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద రాజేశ్ చిత్రపటానికి నివాళులర్పించారు. షేక్ అహ్మద్, కిషన్, జంగమ్మ ఉన్నారు.

ఆమనగల్లు : రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ జన్మదిన వేడుకలు గిరిజన సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు గిరిజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు.

యాచారం : ఎస్‌బీఐ బ్యాంక్ 70వ ఆవిర్భావ దినోత్సవాన్ని యాచారం, మీర్‌ఖాన్‌పేటలో బ్యాంకర్లు ఘనంగా జరుపుకున్నారు. ఆయా బ్యాంకుల మేనేజర్లు సిబ్బంది కేక్ కట్‌చేసి ఖాతాదారులకు చాక్లెట్లతో పాటు కేక్ పంపిణీ చేశారు. బ్యాంక్ ద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తామని యాచారం ఎస్‌బీఐ మేనేజర్ మాన్యనాయక్ తెలిపారు.

శిథిలావస్థలో సర్కారు భవనాలు

(మూడో పేజీ తరువాయి)



మేడిపల్లిలో అంగన్‌వాడీ భవనం దుస్థితి

రూ.4లక్షలతో నిర్మించిన భవనం, వ్యవసాయశాఖ భవనం నిరుపయోగంగా మారాయి. మండల కేంద్రంలో 1996లో నిర్మించిన పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. చింతపట్లలో సొసైటీ భవనంతోపాటు మరికొన్ని భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. తాటిపర్తిలో గ్రంథాలయం కోసం నిర్మించిన భవనాన్ని ప్రైవేటు వ్యక్తులు పాలసేకరణ కేంద్రంగా వాడుకుంటున్నారు. దీనిని ఏఎన్ఎం సబ్‌సెంటర్ కేంద్రంగా మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. కుర్మిద్దలో 1980లో నిర్మించిన గ్రంథాలయ భవనం వినియోగించుకోకపోవడంతో అది శిథిలమవుతుంది. గున్‌గల్‌లో ఏఎన్ఎం సబ్‌సెంటర్ నిరుపయోగంగా ఉండడంతో శిథిలావస్థకు చేరుకుంది. మండల కేంద్రంలో గ్రంథాలయం పక్కన అధికారులు ముందు చూపు లేకుండ రూ.లక్షన్నర నిధులతో నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరింది.

పాత భవనాలు కూల్చి వేయాలి



మా గ్రామంలో పాత భవనాలు శిథిలావస్థకు చేరాయి. వాటిని కూల్చి వేయాలి. వాటిని కూల్చి కొత్తవి కట్టాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదు. కూలడానికి సిద్ధంగా ఉన్న పాత భవనాలను కూల్చడానికి తక్షణమే కలెక్టర్ ఆదేశాలు జారీ చేయాలి. ఈ విషయంలో అధికారులు నిక్కచ్చిగా వ్యవహరించాలి.

\- అలంపల్లి నర్సింహ, సీపీఎం మండల కార్యదర్శి

మరమ్మతులు లేక..

యాచారం మండల కేంద్రంలో 1984లో సాగర్ ప్రధాన రహదారిపై ఎస్సీ దుకాణ సముదాయం నిర్మించారు. గ్రామానికి దూరంగా ఉండడంతో ఎస్సీలు దుకాణాలు ఏర్పాటు చేసుకోలేకపోతున్నారు. నేడా భవనం శిథిలావస్థకు చేరింది. తాటిపర్తిలో పశుసంవర్ధక శాఖ భవన మరమ్మతులకు రూ.5 లక్షలు ఖర్చవుతుందని అధికారుల అంచనా. మంతన్‌గౌరెల్లి పంచాయతీ భవనానికి మరమ్మతులు చేస్తే వినియోగంలోకి వస్తుందని తెలిసినా బీఆర్ఎస్ పాలనలో కొత్త భవనం నిర్మించారు. నందివనపర్తి పాఠశాల భవనం, పిల్లిపల్లి పాఠశాల భవనం శిథిలావస్థలకు చేరాయి. కుర్మిద్దలో సబ్‌సెంటర్ నిరుపయోగంగా ఉంది. చింతపట్లలో నాలుగు తరగతి గదులు శిథిలావస్థకు చేరాయి.

సరికొండ యాదయ్య మృతి బాధాకరం : అంజయ్య యాదవ్



నివాళులర్పిస్తున్న అంజయ్య యాదవ్

కేశంపేట, జూలై 1(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకుడు సరికొండ యాదయ్య మృతి బాధాకరమని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. మండల పరిధిలోని వేములనర్వకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు యాదయ్య సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మంగళవారం గ్రామానికి వెళ్లి మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. అలాగే కుటుంబ సభ్యులను పరామర్శించి అంతిమ యాత్రలో పాల్గొన్నారు.